పేదలకు 'ప్రైవేటు' విద్య మిథ్య

- ఉచిత సీట్లపై ప్రచార లోపం
- అవగాహన కల్పించడంలో విద్యాశాఖ విఫలం
- మండల విద్యాశాఖ కార్యాలయాల్లో కనిపించని హెల్ప్ డెస్కులు



గురజాలలోని మండల విద్యా వనరుల కేంద్రం

గురజాల : పేద పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలపై అవగాహన కల్పించడంలో విద్యాశాఖ అలసత్వం వహిస్తోంది. ఉచిత సీట్లుపై ప్రభుత్వం ప్రకటన విడుదల చేసి చేతులు దులుపుకుంది. విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)సీ ప్రకారం ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు 1వ తరగతిలో 25 శాతం సీట్లను పేద పిల్లలకు ఉచితంగా కేటాయించాలి. కానీ ఆచరణలో మాత్రం ముందుకు సాగడం లేదు. ప్రజల్లో అవగాహన లేకపోవడంతో పాటు విద్యాశాఖ ప్రచారం చేయకపోవడమే ప్రధాన కారణం. దీంతో ప్రైవేట్ పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత సీట్ల కేటాయింపు నీటి మీద రాతలానే మిగిలిపోతోంది.

నోటి మాటలకే పరిమితం

గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల పరిధిలో 20కి పైగా ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారుగా 500కు పైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వారిలో 25 శాతం అనగా 125 మందికి ఉచితంగా సీట్లు భర్తీ చేయాలి. ఫీజులు కడితేనే ఎంట్రీ, లేకపోతే నో ఎంట్రీగా యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. విస్తృతంగా గ్రామాల్లో పర్యటించి మండల, గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా స్థాయి అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో కార్య రూపం దాల్చడం లేదు. పాఠశాలల యాజమాన్యాలు వారి మాటలను పెడచెవిన పెడుతున్నాయి. వాస్తవానికి తల్లిదండ్రులకు ఈ విషయంపై పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడంతో పాటు మండల స్థాయి, గ్రామ స్థాయిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. కానీ ఎక్కడా చూద్దామన్నా కనిపించడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో విద్య మిథ్యగానే మారుతోంది.

నిబంధనలు ఉన్నా అమలు సున్నా

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ మైనార్టీ, అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత , దివ్యాంగ పిల్లలు 2019 ఏప్రిల్ 2 నుంచి 2022 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి. సీట్ల ఎంపికలో అనాథలు, దివ్యాంగులకు 5 శాతం, షెడ్యూలు తెగలకు 4శాతం, షెడ్యూలు కులాలకు 10 శాతం బీసీ, మైనార్టీ, ఓసీ విద్యార్థులకు 6శాతం సీట్లు కేటాయించాలి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి వార్షిక ఆదాయం రూ.1.20లక్షలు, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారికి రూ.1.44 లక్షలు మించి ఉండరాదు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రైవేట్ పాఠశాల్లో పేద విద్యార్థులకు ఉచిత సీట్లపై తాజాగా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. తప్పనిసరిగా 25 శాతం సీట్లు కల్పించాలి. ప్రతి మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రతి పాఠశాలలో ఉచిత సీట్లు అవకాశం ఉంది. పేద విద్యార్థులు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

– సాంబశివరావు, ఎంఈవో, గురజాల

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం


ప్రిన్సిపాల్ మోహన్

రెంటచింతల: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలుర)లో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 40 సీట్లు ఉన్నాయన్నారు. ఇందులో ఎస్టీ-32, ఎస్సీ-5, బీసీ-2, ఓసీ-1 సీటు కేటాయించినట్లు చెప్పారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను స్థానిక పాఠశాలలో అందజేయాలని ఆయన సూచించారు. దరఖాస్తులతో పాటు విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, తల్లి బ్యాంక్ ఎకౌంట్ ఫొటోస్టాట్ కాపీలను జత చేసి పాఠశాలలో అందజేయాలని తెలిపారు. జూన్15న ప్రవేశ పరీక్ష నిర్వహించి, రోస్టర్ విధానంలో ఎంపికలు చేపడతామని వివరించారు. పూర్తి వివరాలకు 83339 25177ను సంప్రదించాలని ఆయన సూచించారు.

'స్వర నీరాజనం' ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల: గాన గంధర్వుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా జూన్ 1న మాచర్ల పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం కళా పరిషత్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో స్వరనీరాజనం పేరిట తెలుగు సినిమా పాటల పోటీలు నిర్వహించనున్నారు. ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం టీడీపీ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ బాలు పేరుతో కళాపరిషత్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళా పరిషత్ అధ్యక్షుడు కొత్త మాసు శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శి మాగులూరి రాంబాబు, కోశాధికారి పఠాన్ జాన్ ఖాన్, జాయింట్ సెక్రటరీ పులుసు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు బాహాటం శేషగిరి రాజు, గట్ల కోటిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ ముటుకుల కమలాసన్ నిర్వహించనున్నారు.

'ప్రీ ఎక్లాంసియా'పై అప్రమత్తత అవసరం


డాక్టర్ కె.పి.చారి

మాచర్ల: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 'ప్రీ ఎక్లాంసియా డే' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.పి.చారి వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. గర్భధారణ సమయంలో సాధారణంగా 20 వారాల తర్వాత లేదా డెలివరీ తర్వాత ప్రభావితం చేస్తుందని చెప్పారు. అధిక రక్తపోటు, మూత్రంలో ప్రొటీన్ ఉండటం వ్యాధి లక్షణాలుగా తెలిపారు. ప్రీ ఎక్లాంసియా తల్లీబిడ్డకు తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరించారు. తల్లికి మూర్ఛ వ్యాధి, గర్భంలో ఉన్న బిడ్డ బరువు తగ్గడం, ఉమ్మనీరు తగ్గిపోవడం లాంటివి జరుగుతాయని వివరించారు. వెంటనే ఈ వ్యాధిని గుర్తిస్తే చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.మరియ సాగర్ రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి

పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి చింతా వెంకట రామారావు



పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి చింతా వెంకట రామారావు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిడుగురాళ్ల పట్టణ కన్వీనర్‌గా అవకాశం కల్పించి, తిరిగి పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమించినందుకు ఆయన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహాయ, సహకారాలతో ఈ అవకాశం కలిగిందని, అహర్నిశలు పార్టీ కోసం కష్టపడతానని తెలిపారు.నాయకులందరిని కలుపుకొని కృషి చేస్తానని చెప్పారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



పిడుగురాళ్ల: లారీ వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనటంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన పెదగార్లపాడులోని శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో బుధవారం జరిగింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న పెదగార్లపాడు గ్రామానికి చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని పిడుగురాళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నాడు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియలేదు.

నల్ల బర్లీ పొగాకు వివరాలు నమోదు చేసుకోవాలి

నాదెండ్ల: నల్లబర్లీ పొగాకు సాగు చేసిన రైతులు శుక్రవారం లోగా రైతు సేవా కేంద్రాల్లో పంట వివరాలు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ చెప్పారు. మండలంలో ఈ ఏడాది 600 ఎకరాలకు పైగా నల్ల బర్లీ సాగు చేశారన్నారు. ఇప్పటికే కొందరు రైతులు పొగాకు దిగుబడిని అమ్ముకున్నారన్నారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిల్వ ఉంచిన రైతులు వివరాలను రైతు సేవా కేంద్రాల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో తమ సిబ్బంది రైతుల వద్దకు వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారని తెలిపారు. దిగుబడిలో ఏ కోతకు ఎంత వచ్చిందనే వివరాలతో పాటు ఇండ్లలో గానీ, పొలాల్లో గానీ, ఇతర ప్రాంతాల్లో నిల్వ ఉంచినట్లయితే వాటి వివరాలు తెలియజేయాలని కోరారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన వ్యాపారులు కూడా వివరాలు తెలియజేయాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

రేపు డయల్ యువర్ డిపో మేనేజర్

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మేనేజర్ బి. కోటేశ్వరనాయక్ తెలిపారు. సమస్యలపై ప్రయాణికులు 9959225430 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

- తహసీల్దార్ ఎస్‌కే ఎండీ హుస్సేన్
- రేపు రక్తదాన శిబిరం



చిలకలూరిపేట: రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలవాలని రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, చిలకలూరిపేట తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా వివిధ తేదీల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమాజంలోని ఆరోగ్యవంతులంతా రక్తదానం చేయవచ్చని, ముఖ్యంగా యువత చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తెలిపారు.

జిమ్ చేసి.. కుప్పకూలి వ్యక్తి మృతి



వినుకొండ : పట్టణంలోని ఓ జిమ్ సెంటర్‌లో గురువారం ఉదయం జిమ్ చేసి బయటకు వచ్చి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన శ్రీను అలియాస్ కిచిడి శ్రీను ఉదయాన్నే జిమ్ చేయడానికి వచ్చారు. అనంతరం వెయిట్ చెక్ చేసుకున్నారు. ఆ తర్వాత బయటకు వెళ్లే క్రమంలో డోర్ దగ్గరే ఉన్నట్లు ఉండి కుప్పకూలిపోయారు. కింద పడుతున్న శ్రీనుని గమనించిన జిమ్ నిర్వాహకులు వెంటనే పట్టుకున్నారు. ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేదు. గుండెపోటుతో శ్రీను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని జిమ్ నిర్వాహకులు తెలిపారు. జరిగిన సంఘటన మొత్తం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఇండియన్ యోగా అసోసియేషన్ కన్వీనర్ శ్రీనివాస్



బెల్లంకొండ: సంపూర్ణ ఆరోగ్యం యోగా ద్వారానే సాధ్యమవుతుందని ఇండియన్ యోగా అసోసియేషన్ కన్వీనర్ పతంజలి శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 'యోగాంధ్ర- ఆయుష్ గ్రామం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యజీవితంలో యోగా ప్రాముఖ్యతను పతంజలి శ్రీనివాస్ వివరించారు. అనంతరం వివిధ ఆసనాలను, యోగాను సిబ్బందితో చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస నాయక్, తహసీల్దార్ అష్రఫున్నీసా బేగం, మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య, ఎంఈవో రాజకుమారి, ఈవోపీఆర్డీ వెంకటగిరిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్ట మహోత్సవం

ఉయ్యందన (క్రోసూరు): మండలంలోని ఉయ్యందన గ్రామంలో గురువారం గంగా పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు అశేషంగా హాజరయ్యారు. ఆలయ అర్చకులు గుండెపూడి లక్ష్మీనరసింహశాస్త్రి, గుండెపూడి నాగరాజశేఖరశర్మ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. ఆలయంలో గణపతి, అమ్మవారు, నవగ్రహాలు, నందీశ్వరుడు, ధ్వజ స్తంభం, కాలభైరవుడు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మేశ్వరస్వామి, వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవారు, దక్షిణామూర్తి, లక్ష్మీనారాయణ, చండీకేశ్వరస్వామి వార్లు, ఆలయ గోపుర శిఖర కలశములు, యంత్ర సహితంగా ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం!

భక్తిశ్రద్ధలతో వాడవాడలా హనుమాన్ జయంతి వేడుకలు

రెంటచింతల: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి మాన్యం కాలనీలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో, ఆర్యవైశ్య పరమేశ్వర స్వర్గపురి ఆవరణం వద్ద నున్న శ్రీ అభయాంజనేయస్వామి మందిరంలో, ఎల్ఎల్ఆర్ స్కూల్ సమీపంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో, జెట్టిపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో గల శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో, రెంటాలలోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో, పాలువాయిగేటులోని మంచికల్లు అడ్డ రోడ్డు వద్ద నున్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. సమష్టి పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. భజన బృందాలు హనుమాన్ చాలీసాను పఠించాయి. ఆలయాల వద్ద భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేసి, మధ్యాహ్నం భారీగా అన్నదానాలు చేపట్టారు. కార్యక్రమంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షులు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాచర్లలో.. పట్టణంలోని ఆంజనేయస్వామి, రామాలయాల్లో గురువారం హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు దేవాలయాలకు చేరుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పాత మాచర్లలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హాజరైన వేలాది మంది భక్తులకు ఆలయ కమిటీ, అర్చకుల ఆధ్వర్యంలో అన్నదానం జరిపారు. శ్రీశైలం రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు వేల మందికి అన్నదానం జరిపారు. రైల్వే స్టేషన్ రోడ్డుకు వెళ్లే రహదారిలో ఉన్న సీతారామ మందిరంలో ఆంజనేయస్వామికి అర్చక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు వేల మందికి అన్నదానం చేశారు. నెహ్రూనగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. పాతూరులోని వీరాంజనేయస్వామి దేవాలయంలో స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


రెంటచింతలలో ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మాచవరంలో..
మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. చెన్నాయపాలెంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో అర్చకులు స్వామికి పంచామృత అభిషేకాలు, నాగ దళార్చన, విశేష పూజలు జరిపారు. మాచవరంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో కుంకుమార్చన, గంధ సిందూరం, నూటొక్క బిందెలతో జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోర్జంపాడు, పిల్లుట్ల, పిన్నెల్లి, మల్లవోలు, వేమవరం గ్రామాల్లో స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


చెన్నాయపాలెంలో స్వామికి ప్రత్యేక అలంకరణ


పాతూరులో ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ

పిడుగురాళ్లలో..
పట్టణంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అభయాంజనేయస్వామి దేవాలయం, మార్కెట్ యార్డు దగ్గరున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాల్లో ఉదయాన్నే భక్తులు అధిక సంఖ్యలో హాజరైన ఆకుపూజలు నిర్వహించారు. అనంతరం సువర్చలా సమేత శ్రీ ప్రసన్నాంజనేయస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. అనంతరం మధ్యాహ్నం మహా అన్నదానాన్ని నిర్వహించారు. గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రచారి దేవస్థానంలో ప్రసన్నాంజనేయస్వామి జయంతిని పురస్కరించుకొని పలు పూజలు జరిపారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.


పిడుగురాళ్లలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పిడుగురాళ్లలో పల్లకీపై సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఊరేగింపు

ఆస్తిపన్ను పెంపుదలకు ప్రత్యేక బృందాలు



నరసరావుపేట: పురపాలక పరిధిలో ఆస్తి పన్ను పెంపుదలకు అధికారులు శ్రీకారం చుట్టారు. వచ్చే జూన్ 15 లోగా అండర్ అసెస్డ్, అన్ అసెస్డ్ వాణిజ్య, గృహాలను గుర్తించి మళ్లీ వాటిపై అదనపు పన్నులు వేసేందుకు సమాయత్తం కావాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల జారీ చేసింది. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అతిథి గృహంలో రెవెన్యూ అధికారులు, వార్డు సచివాలయాల పరిపాలనా కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు, ఎమినిటీస్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణం మొత్తం డోర్ టు డోర్ సర్వే చేసేందుకు కావాల్సిన టీంలను ఏర్పాటు చేశారు. ఇటీవల ఐదుశాతం రిబేట్‌తో అడ్వాన్స్ టాక్స్ వసూలు చేయడంలో ప్రతిభ కనబర్చిన వార్డు సచివాలయ పరిపాలనా కార్యదర్శులు షేక్ కరిముల్లా, కె.భూలక్ష్మి, డి.వీరాంజనేయులు, జి.శాంతి, పి.రమేష్‌లను అభినందించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరు కె.కనకారావు, టీపీవో ఎ.సాంబయ్య, ఆర్ఐ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ జహంగీర్ పాల్గొన్నారు.

పచ్చదనం.. మేకలకు ఆహారం

సత్తెనపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేస్తుంటే సత్తెనపల్లిలో మాత్రం పచ్చదనం కాస్త మేకలకు, ఆవులకు ఆహారంగా మారుతుంది. పట్టణంలోని ప్రధాన రహదారిలో సెంట్రల్ డివైడర్‌పై ఏర్పాటు చేసిన మొక్కలకు ఎలాంటి రక్షణ లేక పోవడంతో ఆవులు, మేకలు మేస్తున్నాయి.

వెనక్కు నడిచి కార్మికుల నిరసన

46వ రోజుకు మున్సిపల్ పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె


పట్టణంలో వెనక్కు నడిచి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు గురువారం వెనక్కు నడిచి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్-ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో 46వ రోజుకు చేరుకుంది. తమను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోనందుకు నిరసనగా సీఐటీయూ జెండాలతో మున్సిపల్ కార్యాలయం నుంచి గడియారం స్తంభం మీదుగా పల్నాడురోడ్డు నుంచి మళ్లీ కార్యాలయం వరకు వెనక్కు నడిచారు. జిల్లా గౌరవాధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లాడుతూ హక్కుల సాధనకు పట్టుదలగా కార్మికులు ప్రదర్శిస్తున్న పోరాట పటిమను అభినందించారు. నెల మొత్తం పనిచేసినా 10 నుంచి 15 రోజులకు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారని, తాము ఆప్కాస్‌లో ఉన్నప్పటికీ సమాన పనికి సమాన వేతనం రూ.21 వేలు ఎందుకివ్వరని ప్రశ్నించారు. పరిసరాల శుభ్రతకు పాటు పడుతున్న తమపై అధికారుల నిర్లక్ష్య వైఖరి అవలంబించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు కనీస వేతనాలు చెల్లించాలని అడగడం వారి ప్రాథమిక హక్కని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మున్సిపల్ కమిషనర్, అధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు.

జర్మన్ ఫ్రీ మాస్టర్ ప్రోగ్రాంకు ఎన్ఈసీ స్పాన్సర్



స్పాన్సర్‌షిప్ పొందుతున్న విద్యార్థులతో కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి

నరసరావుపేట రూరల్: జర్మనీలో ఫ్రీ మాస్టర్ ప్రోగ్రాం చేస్తున్న నలుగురు విద్యార్థులకు స్పాన్సర్ చేస్తున్నట్టు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి తెలిపారు. కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో స్పాన్సర్ షిప్‌నకు అయ్యే రూ.4.5 లక్షల చెక్‌ను విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా మిట్టపల్లి చక్రవర్తి మాట్లాడుతూ కళాశాలకు చెందిన గాదె గోపీకృష్ణ, వడ్లమాను మహేంద్ర, జి.వినయ్‌కుమార్, జాలాది రిచర్డ్ మార్కులు జర్మనీలోని ఆర్‌డబ్లూటీహెచ్ ఆ చెన్ యూనివర్సిటీలో ఎంఎస్ డిగ్రీ కోసం కళాశాల స్పాన్సర్ చేస్తున్నట్టు తెలిపారు. జర్మనీలో మాస్టర్ డిగ్రీ చేయడానికి కావల్సిన ముందస్తు అవసరాల కోసం జర్మనీ ప్రొఫెసర్లు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. దీనివలన మాస్టర్ డిగ్రీలో చేరడం సులభతరం అవుతుందని వివరించారు. జర్మనీలోని ఆర్‌డబ్లూటీహెచ్ ఆచెన్ యూనివర్సిటీతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేస్తున్నట్టు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బి.వెంకటశివ పాల్గొన్నారు.

మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ముప్పాళ్ల : మండలంలోని లంకెలకూరపాడు గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సోమేశ్వరరావు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన 16 సంవత్సరాల మైనర్ బాలిక ఈ నెల 17వ తేదీన ఇంటి నుంచి వెళ్లి కనిపించక పోవడంతో తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.